# కొత్త రచయితలు

## లవ్ స్టోరీ

### గాలికి కులమేది?

తెలతెలవారుతోంది. గాఢ నిద్రలో వున్న రాజ్యానికి వాళ్ళ బామ్మ 'దూరం దూరం' అని కంఠనాళాలు తెగిపోయేట్టు అరిచిన అరుపుకి మెలుకువ వచ్చేసింది. మెల్లిగా లేచి కూర్చుని కిటికీ తెర తొలగించి చూసింది. నాగమ్మ బరాబరా నేల ఊడుస్తోంది. దాని కొడుకు రెండేళ్ళవాడు తెలీక బామ్మ దగ్గరగా వెళ్ళినట్టున్నాడు. ఆవిడ అరిచిన అరుపుకి తారెత్తి పెద్ద పెట్టున ఏడుపు లంకించుకున్నాడు. గాఢంగా నిట్టూర్చింది రాజ్యం.

రోజూ నిద్ర లేవగానే చూసేది బామ్మ ఎవర్నో ఒకర్ని తిట్టే దృశ్యమే. అన్నయ్య కొడుకు మడిబట్ట ముట్టుకున్నాడనో, పనిమనిషి తులసికోటకి చీపురు తగిలించిందనో ఇలాంటివెన్నో. ఏ చిన్న విషయాన్నీ సహించదు బామ్మ. ఒకసారి గట్టిగా ఒళ్ళు విరుచుకొని, పక్క చుట్ట ఓ పక్కన పెట్టి, చేతిలో పళ్ళ పొడి వంపుకొని దొడ్లోకొచ్చింది రాజ్యం. అక్కడ అమ్మ కూరగాయలమ్మితో బేరం చేస్తోంది. కూరలు కొనడమవగానే లోపలికెళ్ళి డబ్బులు తెచ్చి అరుగు మీద వారగా వుంచింది. "కొద్దిగా బుట్టెత్తండమ్మా బరువుంది" అడిగిందది. "మాకు వీలు కాదులే! నాగమ్మా వచ్చి ఈ బుట్ట కాస్త ఎత్తిపెట్టు" అని ఒక రంకె పెట్టి, లోపల్నుంచి మడి నీళ్ళు తెచ్చి కూరగాయల్ని శుద్ధి చేసి లోపలికి తీసుకెళ్ళింది. కూరలమ్మి ఈ వీధికి కొత్తనుకుంటా. లేకపోతే ఈ ఇంట్లో మనుష్యులు దాని బుట్ట ఎత్తడమా! చిన్నగా నవ్వుకుంది రాజ్యం. ఇంతలో పెరట్లో బావి దగ్గిరికి ఏవో శ్లోకాలు చదువుకుంటూ వాళ్ళ నాన్న నారాయణ శాస్త్రిగారొచ్చారు. పనిమనిషి ముట్టుకున్న చాంతాడుని నీళ్ళతో కడిగి, దానికి కట్టి వున్న బకెట్‌ని ఊడదీసి ఇత్తడి బిందె కట్టి, దబాదబా నాలుగు బిందెలు తోడుకొని నెత్తి మీద గుమ్మరించుకొని, మడిబట్ట చుట్టుకొని వస్తూ వస్తూ చెట్టుకు అందంగా పూసి వున్న ముద్దమందార పూలు రెండు తెంపుకొని వేగంగా లోపలి కెళ్ళిపోయాడాయన. తరువాత పెద్దన్నయ్య రాధాకృష్ణమూర్తిగారి స్నానం. పక్కనే వీపు తోమడానికి తయారుగా నుంచున్న దుర్గ వదిన. ఈ స్నానం సీన ఎన్ని రోజులు చూసినా నవ్వు వస్తుంది రాజ్యానికి. బావి దగ్గరున్న బండ మీద కూర్చుని భార్యని ఆజ్ఞాపిస్తుంటాడు. తొందరగా తోడు. కాస్త గట్టిగా తోము వీపు. కాస్త సున్నిపిండిని కాలి మడమ దగ్గర రాయి; ఇలా దాదాపుగా భార్యచేత స్నానం చేయించుకొని, విడిచిన పంచెని భార్యకి బహుమతిగా వదిలి అక్కడితో ఆవిడకి విముక్తి ప్రసాదిస్తాడు.

ఇంతలో హడావుడిగా దొడ్లోకి పరుగెట్టుకొచ్చింది కొత్తగా ఆ ఇంటికొచ్చిన చిన్న వదిన లక్ష్మి. ఆవిడకి బాదమాకులు అందినట్టు లేదు. కంగారుగా అటూ ఇటూ చూసింది. మొగుణ్ణి పిలవడానికి భయం. ఆలస్యం చేస్తే అత్తగారు తిడతారు. అంతలో అపుడే స్నానానికి బావి దగ్గరికొచ్చిన మరిది దీక్షితులు ఆమె కంట పడ్డాడు. బ్రతిమిలాడి ఆకులు కోయించుకుని, అవి శుభ్రంగా కడిగి లోపలికి పరిగెత్తింది. ఇంట్లో అందరూ ఎప్పుడూ పరుగులెత్తుతూనే వుంటారు. గబగబా తిరుగుతుంటారు. తాపీగా వుండేది రాజ్య మొక్కత్తే ఆ ఇంట్లో. అందరి కంటే చిన్న పిల్లని కొద్దిగా గారాబం చేశారు. ఎలాగో ముఖం కడగడం పూర్తిచేసి తిరిగ్గా ఇంట్లో కెళ్ళింది. గుళ్ళో ప్రసాదం పంచినట్టు ఉప్మాని బాదం ఆకుల్లో పెట్టి ఒక్కొక్కళ్ళ చేతిలో ఎత్తి పడేస్తోంది బామ్మ. ఉన్నట్టుండి రాజ్యాని కెందుకో దిగులు ముంచుకొచ్చేసింది. జీవితం మీద విరక్తి పుట్టింది. తన స్నేహితురాళ్ళల్లో అందరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చెయ్యడం, సరదాగా అందరూ కలిసి సినిమాలకీ, షికార్లకీ వెళ్ళడం అతి మామూలుగా జరిగే పని. ఈ ఇంట్లో ఆడా, మగా కలిసి భోజనం చెయ్యడానికే వీల్లేదు. ఇంక సినిమాల కేం వెళతారు? అతి ఛాందసులు ఆ ఇంట్లో వాళ్ళంతా. కొత్తగా ఆ ఇంటికొచ్చే కోడళ్ళకి ఆ ఇంటి తంతు నచ్చకపోయినా చేసేదేమీ లేదు. ఎందుకంటే వారి భర్తలు తల్లి మాట జవదాటరు. ఇంట్లోకి పనిమనిషి రాకూడదు. పేపర్ బోయ్, పాలబ్బాయి గేటు దగ్గరే ఆగిపోవాలి. అన్నయ్యల కోసం, నాన్న కోసం ఎవరైనా బయటివాళ్ళొస్తే వెంటనే కుర్చీల్లో వున్న మెత్తలు తీసెయ్యాలి. పొరబాట్న తియ్యకపోతే వాళ్ళు లేచి వెళ్ళగానే వాటిని ఉతికి ఆరెయ్యాలి. రేడియోలో పాటలు వినకూడదు. కేవలం వార్తలు విని ఆపెయ్యాలి. నవల్లు, వార పత్రికలు చదవకూడదు. ఈ రకంగా ఎన్నో నియమ నిబంధనలు. కానీ రాజ్యం విషయంలో



మటుకు ఈ నియమాలను కొంచెం సడలించారు.

రాజ్యం స్నేహితుల ఇంటి నుంచి పుస్తకాలు తెచ్చి తెగ స్పీడుగా చదివేస్తుంటుంది. ఆ పుస్తకాలన్నీ చదివి తన ఇల్లు ఇంకా ఎంత పురాతన దశలో వుందోనని విచారపడుతుంటుంది. ఏమన్నా విషయాలు ఆ ఇంట్లో వాళ్ళకి చెప్పినా ఆ పుస్తకాల్లో అన్నీ బూతులే రాస్తారు అని కొట్టిపారేస్తుంటారు. వీటన్నిటితో విసిగి

పోయిన రాజ్యానికి ఆ ఇంటిని విడిచి ఎప్పుడెళ్లి పోదామా అన్నట్టుంది. వాళ్ళతో మాట్లాడి ప్రయోజనం లేదని ఎప్పుడూ ఒంటరిగా వుండడం అలవాటు చేసుకుందామె. వెన్నెల్లోంచి చలాన్నీ, పత్రికలోంచి బుచ్చిబాబుని, కొబ్బరి ఆకుల నుంచి కృష్ణశాస్త్రిని తలుచుకుంటూ ఏకాంతాన్ని అనుభవిస్తుందామె.


ఇంట్లో అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళారు. ఇల్లు నిశ్శబ్దంగా, హాయిగా వుంది. స్నానం చేసి చీర కట్టుకుంటోంది రాజ్యం. టకటక తలుపు కొట్టిన చప్పుడైంది. మాధవి అప్పుడే కొత్త పుస్తకాలు తెచ్చినట్టుందే. ఉత్సాహంగా పరుగెట్టి తలుపు తీసింది. మాధవి కాదు. ఎదురుగా ఆరడుగుల అందమైన విగ్రహం. అతని కళ్ళు పలకరింపుగా నవ్వాయి. ఎవరు కావాలి అన్నట్టు చూసిందామె. "మాష్టారుగారు లేరా?" హుందాగా ఉందతని గొంతు. "బయటికెళ్ళారు. రండి కూర్చోండి" ఆహ్వానించింది. రెండడుగులు లోపలికేసి ఏమనుకున్నాడో ఏమో "మళ్ళీ వస్తాలెండి" అని చిన్నగా నవ్వి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడతను. ఎంత అందమైన విగ్రహం! అట్లాగే చూస్తూ నించుంది. మళ్ళీ వేగంగా వెనక్కి వచ్చి "నా పేరు శ్రీకాంత్. మీ నాన్నగారి దగ్గర సంగీతం నేర్చుకోవడానికని వచ్చా. ఆ ఎదురింట్లోనే మేముండేది. మళ్ళీ రేపొద్దున్నొస్తానని చెప్పండి" మళ్ళీ నవ్వాడు ఒళ్ళు పులకరించేలా. గిలిగింతలు పెట్టేలా. అలా చూస్తూ నిలుచుండిపోయింది. ఎంత బాగా నవ్వాడు. అతని నవ్వు చూస్తే ఎవరో గుర్తుకొస్తున్నారే. ఆ! అచ్చం శరత్‌బాబులా నవ్వాడు. కాదు కాదు సంజీవ్ కుమార్‌లా. ఊహు అనుపమ్‌ఖేర్‌లా అనుకుంటా. అబ్బే కాదు. అయినా సోనిద్దూ ఎవరిలా నవ్వితే ఏంటి. మొత్తానికి చాలా అందంగా నవ్వాడు. నవ్వడమేంటి ఎంతందంగా నడిచాడు? అచ్చం విమల్ హీరోలా, ఊహు అంత సన్నంకాదితను. ఆ గుర్తొచ్చింది చిరంజీవిలా. అవును అచ్చం చిరంజీవిలా, హుందాగా, మదగజంలా ఆ నడక, ఇవన్నిటి కంటే కళ్ళల్లో కళ్ళుంచి సూటిగా చూస్తూ కమల్‌హాసన్‌లా మాట్లాడ్డమే తనకి నచ్చింది. ఇంకోటి కూడా నచ్చింది. అమవాస్య చీకట్లో చిగురుటాకు



గుబురులా నల్లని, మెత్తని ఉంగరాల జుట్టు. ఎంతో స్టయిల్‌గా దువ్వుకున్నాడు రవిశాస్త్రిలా కొంచెం చిందరవందరగా వుండి ఎంత బాగుందో. ఇలా ఆలోచనలు ఇంకా ఎంతసేపు సాగేవో తెలీదు. "ఎవరే వచ్చింది" అన్న బామ్మ అరుపుతో తిరిగి ఈ లోకంలోకి వచ్చిందామె. "ఎవరో శ్రీకాంత్‌ట. సంగీతానికొచ్చాడు". "శ్రీకాంతా? అంటే ఎదురింటి అబ్బాయి. వాడిని లోపలికి రమ్మంటావుటే. నీకు రాను రానూ మతిపోతున్నట్టుంది. ఆ పరదా ముట్టుకున్నాడో ఏమిటో ఖర్మ! దాన్ని ఉడబీకు' ముక్కుతూ మూల్గుతూ ఆపసోపాలు పడుతోందావిడ. రాజ్యం మనసు మూగబోయింది. అంత చక్కటి అబ్బాయిలో బామ్మకి అంటరానితనం ఏం కనిపించిందో అర్థం కాలేదు. సంగీతం చెప్పే డబ్బులు గుంజడానికి మాత్రం అంటరానితనం ఏమీ లేదు. పళ్ళు నూరుకుంది కసిగా.

రోజులు గడుస్తున్నాయి. అయితే ఆ రోజులు ఇదివరకులా నిశ్శబ్దంగా, నిరుత్సాహంగా గడవడం లేదు రాజ్యానికి. శ్రీకాంత్ స్నేహంతో ఆమె మనసు పురి విప్పిన నెమలిలా మారింది. తన మృదువైన గొంతుతో మధురంగా మాట్లాడుతుంటే వళ్ళు మర్చిపోయి వింటుందామె. శ్రీకాంత్ సంగీతం చెప్పించుకుంటున్నంతసేపూ నాన్నగారికి మంచినీళ్ళు ఇచ్చే నెపంతో, వీధిలో పూలు కొనే నెపంతో అటూ ఇటూ తిరుగుతూనే వుంటుంది రాజ్యం. అతనితో మాట్లాడాలని తహతహలాడిపోతోంది. ఇదివరకు సహారా అంత నిర్లిప్తమైన మనసు, ఇప్పుడు నిండు గోదారిలా ఉరకలేస్తోంది. ఇదివరకు వెళ్ళమని బామ్మ ఎంత పోరినా వెళ్ళని కొండ మీది గుడికి ఇప్పుడు రోజూ వెళుతోంది. పూజారి పెట్టిన ప్రసాదం శ్రీకాంత్‌తో పంచుకుతింటోంది. వారి స్నేహం దినదిన ప్రవర్ధమానమౌతోంది.

నిశ్శబ్దం ఉదయపు అలజడిలో కొద్ది కొద్దిగా భగ్నమౌతోంది. ఇంట్లో జనాలందరూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్న శబ్దాలకి మెలకువ వచ్చింది రాజ్యానికి. అప్పుడు గుర్తొచ్చింది— ఇవాళ మామయ్యావాళ్ళింట్లో సత్యనారాయణ వ్రతమని. రాజ్యం బయటుంది కనుక పూజకి రాకూడదని శాసించింది తల్లి. మరీ మంచిదని హాయిగా పడుకుంది. అందరూ తయారై జాగ్రత్తల అప్పగింతలు పూర్తిచేసి వెళ్ళిపోగానే ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది. రాత్రి వరకూ ఎవరూ రారు. కొత్త నవల్లు తెచ్చుకుంటే హాయిగా చదువుకోవచ్చు. తయారవుదామని బీరువా తీసింది. కొత్త చీర చేతిలోకి తీసుకుంది. బీరువాలో వున్న బట్టలన్నింటినీ ముట్టుకుంది. ఇంట్లో వున్న వస్తువులన్నిటినీ తనివితీరా ముట్టుకుంది. బామ్మ ఆరేసుకున్న మడిబట్టని కూడా ముట్టుకుంది. ఇంటికి రాగానే బామ్మ స్నానం చేసి ఆ బట్ట కట్టుకొని అన్నం తినడం గుర్తొచ్చి నవ్వుకుంది రాజ్యం. తను ముట్టుకోగానే ఏదన్నా మార్పొచ్చిందా? అని పరిశీలనగా అన్ని వస్తువులనీ చూసింది. ఏం మార్పు కనబడలేదు. మరి మైలపడడం అంటే ఏమిటి? నవ్వుకుంది తన ఇంట్లోవాళ్ళ చాదస్తానికి. తీరిగ్గా గంటసేపు అద్దం ముందు కూర్చుని తయారైంది. దొడ్లోకెళ్ళి గులాబీ పువ్వు తెచ్చుకుందామా అనుకొని మళ్ళీ పక్కింటివాళ్ళు గుర్తొచ్చి మానేసింది. గులాబీ పువ్వు అనుకోగానే శ్రీకాంత్ గుర్తొచ్చాడు. అతను రాసుకునే పౌడరు గులాబీ పూల సుగంధాన్ని వెదజిమ్ముతుంటుంది. ఏం చేస్తుంటాడు? హడావిడిగా ఆఫీసులో ఫైల్సు చూసుకుంటున్నాడేమో. ఆఫీసులో వున్నప్పుడు తను గుర్తొస్తుందా అసలు. ఆమె ఆలోచనలను మించి తలుపు టకటక చప్పుడయింది. గుండె ఆగినంత పనయింది రాజ్యానికి. పొరబాట్న ఇంట్లో వాళ్ళెవరైనా వెనక్కి తిరిగొచ్చారేమో. ఇంకేం లేదు, ఈ కొత్తచీర, ఈ అలంకరణ చూస్తే నరికేస్తారు కూడా. నిశ్శబ్దంగా కిటికీలోంచి తొంగి చూసింది. సంతోషం ఉప్పెనలా పొంగింది. తెల్లని మల్లెపువ్వు లాంటి లాల్చీలో శ్రీకాంత్. హిమంచి ముత్యాల్లాంటి జల్లు సన్నగా పడుతుంటే సన్నగా ఏదో పాట హమ్ చేస్తూ నిల్చున్నాడతను. వేగంగా వెళ్ళి తలుపు తీసింది. "తొందరగా లోపలికిరండి. తడిసిపోతున్నారు" అంది సన్నని గొంతుతో. "ఇంత చిన్న వర్షంలో తడుస్తేనేం. చల్లగా, హాయిగా వుంటుంది" నవ్వాడతను. "కాదు కాదు. మళ్ళీ జలుబు చేస్తే కష్టం' ఆదుర్దా పడిందామె. అయితే ఆదుర్దా అంతా అతని జలుబు గురించి కాదు. పక్కింటివాళ్ళు చూస్తారేమోనని. కంగారుగా అటుకేసి చూసింది. పక్కిల్లు కూడా తాళం పెట్టే వుంది. హమ్మయ్య! అని నిట్టూర్చి, తలుపు బార్లా తీసి కూర్చోండి అని కుర్చీ చూపించింది. "ఇంత నిశ్శబ్దంగా వుందే? మీ వాళ్ళెవరూ లేరా?" అన్నాడు రిలాక్స్‌డ్‌గా కుర్చీలో కూర్చుంటూ. "ఇంట్లో వాళ్ళందరూ పూజకెళ్ళారు. కూర్చోండి కాఫీ తెస్తా" వేగంగా లోపలికెళ్ళిపోయి తొందరతొందరగా కాఫీ కలిపి తెచ్చింది. కప్పు పట్టుకున్న ఆమె చెయ్యి వణికింది.



Debbrata Ghoshal

ఇంట్లో తామిద్దరమే అన్న ఫీలింగ్ భయాన్నీ, సంతోషాన్నీ సమపాళ్ళలో కలిగిస్తోంది. వంగి కాఫీ కప్పు టీపాయ్ మీద పెడుతున్న ఆమెని పరిశీలనగా చూశాడు అతను.

లాలిత్యాన్నీ, అమరాగాన్నీ, శృంగారాన్నీ, మాధుర్యాన్నీ ఏకం చేసి రెప్పల క్రింద దాచుకున్న ఆ విశాలమైన కళ్ళు, మెత్తని మందారాల్లా ఎర్రగా వున్న పెదవులు, ముద్దొచ్చే చిన్ని గడ్డం, పైట కొంచెంగా తొలిగి, బ్లౌజు పైభాగం వంగిలోన నచ్చగా, విందుగా చలిస్తూ కనిపించిన ఆమె స్తనాలు, ఇంక ఆ అందాన్ని భరించలేక అతని దృష్టి మసకైపోయింది. గాలి ఆమె తలలోని మల్లెల సౌరభాన్ని పీల్చుకొని అతని నావరించింది. ఆమె సౌందర్యాన్ని కళ్ళతో తాగేసి మత్తుగా కూర్చుండిపోయాడతను. "కాఫీ తీసుకోండి. చల్లారిపోతుంది" అంది కప్పునందిస్తూ. కాఫీ అందుకుంటుంటే కాలింది కప్పో, వేళ్ళో అర్థం కాలేదతనికి. అతని విశాల వక్షం వైపు, తడిసిన పల్చని లాల్చీలోంచి స్పష్టంగా కనిపించే బలమైన కండరాల వైపు ఒక్క క్షణం చూసిన ఆమెకి మైకం కమ్మినట్టయింది, ఆ కండలు తిరిగిన నళ్ళు బలంగా నన్ను చుట్టేస్తే' ఆ ఆలోచనతో ఉలిక్కిపడిందామె. వళ్ళంతా వేడి సెగలూ, పొగలూ కమ్మినట్లయింది. ఇంక అక్కడ కూర్చోలేక బెడ్‌రూమ్‌లో కెళ్ళి కిటికీ దగ్గర నుంచుంది. హాయిగా మట్టి వాసన కొడుతోంది. వేసవి ఉదయం వర్షమొక వింత హాయి. గుమ్మం దగ్గర మెత్తని పాదాల సవ్వడి. ఆ సవ్వడి మెల్లిగా ఆమె వరకూ. భుజం మీద బలమైన చెయ్యి. నిలువెల్లా వణికిందామె. అతని చేతి వేళ్ళు కూడా వణికాయి. భయానికి కాదు, ఒక రకం అలజడి. ఆమె స్పర్శవల్ల కలిగే అలజడి. ఆమె మెడ మీద మెత్తగా, వెచ్చగా, అతని పెదవులు తగిలాయి. అతని చేతులు ఆమె వీపు చుట్టూ మెలిపడ్డాయి. ఆమె చేతులు అతని నడుం చుట్టూ బిగుసుకున్నాయి. కాళ్ళు మంచం వరకూ వెళ్ళాయి. అతని వళ్ళో తల పెట్టుకొని పడుకుంటే ఎంతో ప్రశాంతత. మరెంతో హాయి. ఆమె విశాలమైన కనురెప్పల మీద అతని పెదాలు మంచుతుప్పరలా ఆనాయి. అక్కడ నుంచి కదిలి సున్నితంగా చెవి తమ్మెని నత్తాయి. ఇంక ఆగలేకపోయింది. అతని తల వెనుక తన అరిచెయ్యి ఆన్చి, నత్తిడిగా అదిమి — అతన్ని చుట్టేసి ఇంకా దగ్గరగా అదిమేసుకుంటోంది. అతని ఊపిరి వెచ్చగా తగిలి కాలిపోతోంది. ఆమె శరీరం అతని మీద పొరలి,

రచయిత్రి చిరునామా:

—జి. శైలజ
5 - 66/3,
మారుతినగర్,
హైదరాబాదు - 36



పొంగి, నురగలై, తరగలై, అలలై, సుడులు తిరిగి అతనిని ముంచెత్తుతోంది.

"ఐ లవ్ యూ" అంది గుసగుసగా. "అది నీ చూపు నా కెప్పుడో చెప్పింది" మంద్ర స్థాయిలో మృదువుగా వుందతని గొంతు. "కానీ మనం కలిసి వుండడం అనేది సాధ్యమేనంటావా? అందరూ నన్ను అంటరానివాడిగానే చూస్తారు. నన్ను పెళ్ళి చేసుకుంటే నిన్ను కూడా మీ వాళ్ళందరూ అంటరానిదాన్నిలాగే చూస్తారు. నువ్వు ఎన్నో కష్ట నిష్టూరాల్ని ఎదుర్కోవలసి వస్తుంది. మరొక్కసారి ఆలోచించు" అతని గొంతు బాధతో బొంగురుపోయింది.

"ఈ ఆచారాలు, కట్టుబాట్లు అంటే మొదటి నుంచీ నా కిష్టం లేదు. మా ఇంట్లో వాళ్ళు, చివరికి నా స్నేహితులు కూడా ఎవరన్నా కనబడగానే నీ పేరేంటి, ఉద్యోగమేంటి, జీతం ఎంత? అని అడిగినంత సహజంగా నీ కులమేమిటి? అని అడుగుతారు. అప్పుడు కానీ వీళ్ళు కూడా తాగరు. ఇప్పుడు నేను చేసే ఈ పనికి ఆచారవంతుల కుటుంబంలో పెరిగిన దానివి, నిప్పు కడిగే వంశంలో పుట్టిన దానివి చివరికిట్లా మాలవాడిని కట్టుకొని క్షుద్రురాలివి, భ్రష్టురాలివీ అవుతావని మేము కలలో కూడా అనుకోలేదు" అని మొహం నిండా జాలి, కోపం, దిగులూ నింపుకుంటారు. వీళ్ళు చేసే పూజలు, తద్దినాలు, వ్రతాలు, అభిషేకాల వల్ల గొప్ప ప్రయోజనం ఏమీ లేకపోయినా వాటిని మాన లేకపోవడం, వాటిల్లో నమ్మకం పోయినా, మర్యాద కోసం, ప్రతిష్ట కోసం బంధువులతో సంబంధం కోసం అర్థవిహీనపు పనులు చెయ్యడం అంత దౌర్భాగ్యం మరొకటి లేదు. వీళ్ళు చేస్తున్న పనులకి అర్థం వీళ్ళకే తెలీదు. పొట్ట పగిలేదాకా వున్నవాళ్ళనే పిలిచి పెడతారు కానీ, బీదవాళ్ళకి చెయ్యి విదల్చరు. ఈ స్వభావం నా కసలు నచ్చదు. మా నాన్నావాళ్ళు చూసిన సంబంధాన్ని చేసుకొని జీవితాంతం నా కిష్టం లేని పనులు చెయ్యడం కంటే, ఈ కోట గోడల్లాంటి రెండు చేతుల మధ్యా హాయిగా కళ్ళు మూసుకొని మరణిస్తే మంచిది" ఆవేశంగా మాట్లాడుతున్న ఆమె పెదాలకి చెయ్యి అడ్డం పెట్టి మూసేశాడతను.

"ఎందుకంత ఆవేశం?" అతని చేతులు ప్రేమగా, లాలనగా ఆమె తలని నిమురుతున్నాయి. "ఆవేశం కాదు: నిజం. నా తల నీ గుండెల మీద, నీ చేతులు నా చుట్టూ, నీ ముద్దులు నా పెదవుల మీదా, ఇంత కంటే ఏం కావాలి నాకు? ఎవరు ఏమన్నా సరే. మా అమ్మా, నాన్నా ఇంటి నుంచి వెళ్ళగొట్టినా, సంఘం వెలేసినా సరే నా వైపుకి, నా కోసమే నాలుగడుగులు ధైర్యంగా వేసిన మీ పాదాల ముందు నా జీవితాన్ని అర్పించుకుంటాను" దృఢంగా చెప్పిందామె. అంత తొందర్లో అంత స్థిర నిశ్చయం తీసుకున్న ఆమెని చూసి ఆశ్చర్యపోయాడతను. ఆమెని పదిలంగా వళ్ళోకి తీసుకున్నాడు. కాస్పియన్ సముద్రంలో తేలే మంచు కొండల్లా చలిస్తున్న ఆమె స్తనాలని మృదువుగా ముద్దాడాడు. కళ్ళు మూసుకుని పడుకున్న ఆమెని చూస్తే సౌందర్యం అలసిపోయి నిద్రలో సల్పగా నవ్వినట్టనిపిస్తోంది. "నిన్ను నా గుండెల్లో గుట్టుగా, లోతుగా దాచేసుకుంటాను" మెత్తని ఆమె గుండెల్ని రెస్ట్‌పాయింట్‌గా తీసుకొని విశ్రాంతి తీసుకుంటూ చెప్పాడతను.

'తన నిర్ణయం సమంజసమైనదే. శ్రీకాంత్ తన ఆదర్శాలకీ, భావాలకీ సన్నిహితంగా వచ్చాడు. ఊహాలోకంలో, గాలిలో పూతీగల కుటీరాలు అల్లుకుంటూ కూర్చుంటే చివరికి జీవితం అంతా కళ్ళముందే నడిచి వెళ్ళిపోతుంది. ఇప్పుడు తను తీసుకున్న నిర్ణయం వల్లతన జీవితం కొత్త బాటన నడుస్తుంది. అతని ప్రేమ మెత్తని ఉదయకాంతిలా తన జీవితానికి అందాన్నీ, శాంతినీ ఇస్తుంది. తమకు పుట్టబోయే బిడ్డల్ని బంధువుల నుంచి, కట్టుబాట్లతో మురిగిపోతున్న సంఘం నుంచి, అర్థం లేని ఆచారాల నుండి విడదీసి, కులం, మతం తారతమ్యం లేకుండా ఉత్తమ భావిపౌరులుగా తీర్చిదిద్దాలి. అప్పుడే ఈ పెళ్ళికి సార్థకత' అనుకుంది పసిపాపల్లే తన మీద పడుకున్న అతని నుదురు ముద్దాడుతూ. అంతకాలం ఆ ఇంటి నుంచి కదలకుండా తిష్ట వేసుకొని కూర్చున్న ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కట్టలు తెంచుకొని పరిగెత్తాయి ఈ దృశ్యాన్ని చూడలేక. ◆